క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



చవరంబాకం గ్రామంలో పారిశుధ్య పనులు

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో తాగునీరు లీకేజీ ఉన్న చోట శుక్రవారం మరమ్మతులు చేశారు. అదే విధంగా పారిశుధ్యం పనులు కూడా చేపట్టారు. వర్షాలు పడుతుండడంతో గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించడంతో స్పందించిన సర్పంచ్‌లు మరమ్మతులు చేపడుతున్నారు. నింద్ర పంచాయతీ దళితవాడలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడం, తాగునీరు లీకేజీ లేకుండా చేశారు. అదే విధంగా చవరంబాకం గ్రామంలో తాగునీరు పైపులైన్‌ను బాగు చేశారు.

ఇంటిలోకి చొరబడ్డ నాగుపాము



నాగుపామును బాటిల్‌లోకి ఎక్కిస్తున్న స్నేక్ క్యాచర్

నగరి: అప్పుడప్పుడూ తుంపర్లు పడుతూ వాతావరణం చల్లబడుతుండడంతో పాముల బెడద ఎక్కువైంది. నివాసాల చుట్టూ పొదలు, ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో వీధులపైనా, పూలతొట్టెల వెనుక, ఇండ్లలోను పాములు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలోకి 6 అడుగుల పొడవున్న నాగుపాము చొరబడి హల్‌చల్ చేసింది. స్థానికంగా ఉన్న స్నేక్ క్యాచర్‌కు కబురు పంపడంతో అతను చాకచక్యంగా ఆ పామును బాటిల్‌లో పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాలు సరఫరా



పాడి రైతులకు రాయితీ విత్తనాలను అందిస్తున్న పశువైద్యాధికారి శ్రీవిద్య

శ్రీరంగరాజపురం: పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను శుక్రవారం మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య పాడి రైతులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 75 శాతం రాయితీపై పాడి రైతులకు అందిస్తామన్నారు. తయ్యూరు, శ్రీరంగరాజపురం పశు వైద్యశాలలో 1000 కేజీల జొన్నలు, 1500 కేజీల మొక్కజొన్నలు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కెట్ రేటు ప్రకారం జొన్నలు 1 కేజీ రూ.92, మొక్కజొన్నలు 1 కేజీ రూ.68 అన్నారు. ప్రభుత్వ రాయితీ పోను రూ.17 రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులంతా ఉపయోగించుకోవాలన్నారు. రాయితీ విత్తనాలు కావాల్సిన వారు ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకురావాలన్నారు.

వస్త్ర దుకాణాల్లో వరుస చోరీలు



చోరీ చేస్తూ సీసీ కెమెరాకు చిక్కిన మహిళ

గంగాధర నెల్లూరు: మండలంలోని వస్త్ర దుకాణాలలో వరుసగా చోరీలు జరుగుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. మండలం కేంద్రంలోని జనం ఎక్కువగా ఉన్న దుకాణాల్లో కొందరు ఆడవారు ఇద్దరు ముగ్గురుగా వచ్చి రకరకాలు చూపించమని అడుగుతూ వస్త్రాలను చోరీలు చేస్తున్నారు. మొత్తం దుకాణం పూర్తిగా చూసిన తర్వాత ఏమీ వద్దని వెళ్లిపోతున్నారు. దుకాణ యజమానులు సీసీ కెమెరాలను పరిశీలించగా చోరీల విషయం బయటపడింది. అదేవిధంగా కొత్తపల్లి మిట్టలో కూడా ఇదే సంఘటన జరగడంతో దుకాణ యజమానులు ఒకరినొకరు సంప్రదించుకుని నిందితుల ఫొటలను వాట్సాప్‌లో షేర్ చేసుకుంటున్నారు. పోలీసు అధికారులు ఈ విషయాన్ని దర్యాప్తు చేసి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

ఆ రెండు సమస్యలు అధిగమిస్తే...

రైతులు సాగు చేస్తున్న నిమ్మ తోటల్లో ప్రధాన సమస్య మంగు. ఇది సోకిందంటే అన్నదాతకు తీవ్ర నష్టమే. సూక్ష్మధాతు లోపం కూడా నిమ్మ పంటను బాగా వేధిస్తుంటుంది. అధికారుల మాటల్లో చెప్పాలంటే దేశంలో ఎక్కడా సూక్ష్మధాతు లోపం లేకుండా నిమ్మ తోటలు లేవు. మంగు, సూక్ష్మధాతు లోపం సమస్యల నుంచి తోటను కాపాడగలిగితే ఆ రైతులు తన కష్టానికి తగిన ప్రతి ఫలాన్ని ఇంట్లో ఉంచుకున్నట్లే. నిమ్మ రైతు శ్రేయస్సు కోసం ఈ రెండు ప్రధాన సమస్యల నుంచి గట్టెక్కే విధానాలపై వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ పలు సూచనలు అందజేశారు.

– పాలసముద్రం

- నిమ్మలో అధిక దిగుబడి సాధ్యం
- మంగు, సూక్ష్మధాతు లోపాల నివారణకు సూచనలు



దీనబంధుపురంలో నిమ్మతోట

మండలంలో దాదాపు 20 ఎకరాల్లో నిమ్మ పంట కాపు దశలో ఉంది. ఇప్పుడు కూడా నిమ్మ సాగు మొదలుపెట్టవచ్చు. కంద, అరటి, పసుపు పొలాల్లో కొత్తగా సాగు చేసుకుంటే సమయం కలిసి వస్తుంది. ప్రస్తుతం కాయ దశలో ఉన్న నిమ్మలో మంగు, సూక్ష్మధాతు లోపాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.

మంగు అంటే...

నిమ్మలో ప్రధాన సమస్య మంగు. ఇది నల్లి పురుగు వల్ల వస్తుంది. మొక్కల్లో ఎదుగుదల లోపించడం. కాయ నాణ్యత దెబ్బ తినడం, నల్ల మచ్చ ఏర్పడడం మంగు లక్షణం. నల్లి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరు 40 శాతం వరకు దిగుబడి దెబ్బ తినే అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. మంగు సోకిందంటే కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. మంగు సోకిన చోట ఎండ తగిలితే రసాయన చర్య జరిగి కాయ కుళ్లిపోతుంది. మార్కెట్‌లో నిమ్మ కాయలు కొనుగోలు చేయరు. ధరలు తగ్గిపోతాయి. దిగుబడులు పూర్తిగా పడిపోతాయి.

మంగు సమస్యకు పరిష్కారం

- నల్లని మచ్చలను పూర్తిగా నిర్మూలిస్తేనే మంగు సమస్య నుంచి రైతులు బయటపడతారు.
- మంగుపై రైతుల్లో అనేక ఆపోహలున్నాయి.
- పురుగు మందు కొడితే మంగు పెరుగుతుందనే అభిప్రాయం తప్పు.
- మంగు నివారణకు మందులు పిచికారీ చేస్తే నల్లి చావదని. పైగా మంగు పెరిగిపోతుందని రైతుల్లో భయం ఉంది. దీని నుంచి బయటకు రావాలి.
- 2 ఎంఎల్ ఫైరోమైట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే నల్లి నుంచి పంటను కాపాడవచ్చు.

సూక్ష్మధాతు లోపం

- మొక్కలను నాటాక ప్రతి రెండు నెలలకు చిగుర్లు వచ్చేటప్పుడు సూక్ష్మధాతు మిశ్రమంలో ఆగ్రోమిన్‌మాక్స్, రోగార్, క్లోరిఫైరిఫాస్‌లో ఏదో ఒకదానిని కలిపి పిచికారీ చేయాలి.
- దీనివల్ల పురుగులు పంటను తింటాయనే భయం ఉండదు. మొక్కల పెరుగుదల కూడా బాగుంటుంది.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువుల. రసాయన ఎరువులను పంటకు తప్పనిసరిగా వేయాలి. ప్రతి ఆరు నెలలకు ఎకరా పొలంలో 800 గ్రాముల యూరియా, 1200 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 500 గ్రాముల పొటాష్, 3 కిలోల వేపపిండి లేదా ఆముదం చెక్క, 50 కిలోల పశువుల ఎరువు తప్పనిసరిగా అందించాలి.



ఢిల్లీప్రసాద్

- ఒక్కో మొక్కకు 150 గ్రాముల పశువుల ఎరువులో ఫార్ములా 7ను కలిపి ప్రతి ఏడాది అందించాలి. దీనివల్ల సూక్ష్మధాతు లోపం కనిపించదు.
- సూక్ష్మధాతు లోపం కనిపిస్తే 3 గ్రాముల ఆగ్రోమిన్ మ్యాక్స్‌ను లీటరు నీటిలో కలిపి వారంలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

తోటలో కాసిన నిమ్మకాయ



కీలక మెళకువలు

- సూక్ష్మధాతు లోపం నివారణకు నులి పురుగులు లేని బలమైన మొక్కలను రైతులు ఎంచుకోవాలి.
- ఎటుచూసినా ఆరు మీటర్ల దూరం ఉండేలా మొక్కలు నాటాలి.
- డ్రిప్ పద్ధతిలో సాగు చేపడితే కలుపు సమస్యను అధిగమించవచ్చు. మొక్కలు బాగా పెరుగుతాయి.
- డ్రిప్ పద్ధతి ద్వారా వేరుకుళ్లు నివారించుకోవచ్చు. పంటలో వేరుకుళ్లు కనిపిస్తే జ్ఞానోడెర్మాను పిచికారీ చేసుకోవాలి.

- బ్లాక్, బ్రౌన్ సల్ఫర్‌లో ఏదో ఒకటి లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే నల్లిని నివారించుకోవచ్చు. అయితే తోటలో పూత మీద ఉన్నప్పుడు సల్ఫర్ పిచికారీ చేయకూడదు. కాయ మీద ఉన్నప్పుడే పిచికారీ చేసుకోవాలి. అందుకే ఫైరోమైట్ పిచికారీ చేయడమే శ్రేయస్కరం.

మాజీ సైనికులకు సన్మానం



సన్మానం అందుకున్న మాజీ సైనికులు

నగరి: కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరినీ స్మరించుకుంటూ నగరి పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరినీ స్మరించుకుంటూ నగరి బస్టాండ్ నుండి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం దేశం కోసం పోరాడి విశ్రాంతి పొందుతున్న మాజీ సైనికులకు దుశ్శాలువాలు వేసి, షీల్డులు ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పాకిస్తాన్‌కు భారత దేశానికి జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశారని, 1363 మంది సైనికులు గాయపడ్డారని గుర్తు చేశారు. ఈ యుద్ధం 1999 సంవత్సరం మే నెల 3 తేదీన ప్రారంభమై 1999 సంవత్సరం జూలై 26 తేదీ వరకు జరిగిందని ఈ యుద్ధంలో భారత సైన్యం పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టి ఆక్రమణకు గురైన మనదేశ భూభాగం స్వాధీనం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిక్రిష్ణమ నాయుడు, పి.రామ్మూర్తి యాదవ్, జి.నారాయణస్వామి నాయుడు, రమేష్ నాయుడు, వేలాయుధం, జగదీష్ రాజు, రాము, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

29న బహిరంగ వేలం

పుత్తూరు: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పుత్తూరు పట్టణంలోని నిర్ణీత ప్రదేశాల్లో తాత్కాలిక దుకాణాల నిర్వహణ కోసం ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు 11వ తేదీ నుంచి 28 వరకు 18 రోజులపాటు మాత్రమే రుసుము వసూలు చేసుకొనుటకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి స్పందన



కృత్రిమ కాళ్ల కొలత శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తపోవనం వద్ద ఉన్న రాస్ భవనంలో ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల కోసం విచ్చేశారన్నారు. నియమ, నిబంధనల ప్రకారం అర్హుల కాళ్ల కొలతలను తీసుకోవడం జరిగిందన్నారు. కొలతలు ఇచ్చి అర్హత ఉన్న వారందరికీ త్వరలో కృత్రిమ కాళ్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సావెక్స్ టెక్నాలజీ సంస్థ నిర్వాహకులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

చిత్తూరు అర్బన్: విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా కనీస అవగాహన ఉండాలని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై కలిగే పర్యవసనాలు, పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. బాలలపై లైంగిక దాడుల నివారణ కోసం పోక్సో రూపొందించారని తెలిపారు. మహిళల రక్షణ కోసం పోలీసుశాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఫిర్యాదు అందిన వెంటనే ప్రతి స్పందిస్తామన్నారు. గృహహింస నిరోధక చట్టం మహిళల హక్కులకు రక్షణగా నిలుస్తుందన్నారు. సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ శాంతమ్మ, ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన



జీడీ నెల్లూరు నీవానదిపై వంతెన

గంగాధర నెల్లూరు: నీవా నదిపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిత్తూరు నుండి జీడీ నెల్లూరు వైపు వంతెనపై గతంలో ఒక వాహనం ఢీకొని వంతెన మీద ఉన్న ప్రహరీ గోడ విరిగి కింద పడిపోయింది. అప్పటినుండి ఎవరూ పట్టించుకోక అలాగే ఉండిపోయినది. వర్షాలకు వంతెనకు ముందున్న తారు రోడ్డు దెబ్బతినగా భారీ గుంత ఏర్పడింది. వాహన ప్రయాణికులు ఆ గుంతను తప్పించబోయి వంతెన కింద పడిపోయే ప్రమాదం ఉందని నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వెళుతున్న పాఠశాలల బస్సులు వేలాది వాహనాలు, ద్విచక్ర వాహనదారులు, ఉన్నతాధికారులు కూడా ఇదే దారిలో ప్రయాణిస్తుంటారు. ఈ ప్రహరీ గోడ(పారాఫిట్ వాల్)ను అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే చొరవ తీసుకొని నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులకు చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం బలికండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, గుడ్లు ప్రతి రోజు సక్రమంగా పెట్టాలని తెలిపారు.

రసం, సాంబార్లలో అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. ముఖ్యంగా ప్రదానోపాధ్యాయుడు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా పెట్టాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చేసిన సాంబారు, రసం రుచి చూశారు. ఆయన వెంట హెచ్ఎం రఘు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఆందోళన వద్దు



వెంగళరాజుకుప్పంలో స్పర్శలేని మచ్చలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: కుష్టు వ్యాధిని ప్రథమ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం దళితవాడలో సూపర్‌వైజర్ మురళి, సుశీల ఆరోగ్య సిబ్బందితో కలసి కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. స్పర్శలేని మచ్చలుంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించవచ్చని తెలిపారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కన్పిస్తే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వాస్పత్రిలో పూర్తిస్థాయి ఉచిత వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గంగాగౌరి, ఆశా పాల్గొన్నారు.

యువత ఆశయాలతో ముందుకు వెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

నగరి: యువత నిర్ణీతమైన ఆశయాలను ఏర్పరచుకుని తమలోని శక్తిని గుర్తించి ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కళాశాలలో 3వ సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు శ్రమించి విజయాన్ని సొంతం చేసుకోవాలన్నారు. ఓటమిని గెలుపు పాఠంగా మార్చుకోవాలన్నారు. చంద్రయాన్–2 విఫలమైందని విరమించి ఉంటే చంద్రయాన్–3 ఉండేది కాదని, విజయం లభించి ఉండేది కాదన్నారు. విద్యార్థులు పట్టువదలని విక్రమార్కుల్లా శ్రమించాలని, ప్రయత్నాలు చేస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీసీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కోటా వెంకటాచలపతి మాట్లాడుతూ గతంతో పోలిస్తే నేడు పోటీ ఎక్కువైందని, అంతేగాని అవకాశాలు లేకుండా పోలేదన్నారు. కృషి, పట్టుదల ఉంటే అన్నీ సాధ్యమే అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర రాజు, కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి, అధ్యాపకులు సుబ్రమణ్యం, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి దేశభక్తి పెపొందించుకోవాలి



జాతీయ పతాకాలతో మానవ హారం

కార్వేటినగరం: బాల్యం నుంచే ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డీఎం పురం ఉన్నత పాఠశాల ఆవరణంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవరుచుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని హరిత మాట్లాడుతూ 1999 నాటి కార్గిల్ యుద్ధ వాతావరణాన్ని, భారత వీరుల పోరాట స్ఫూర్తిని, విజగాథను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజు, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, చిన్నయ్యశెట్టి, వెంకటరమణయ్య, సరస్వతి, మాలతి, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవన నిర్మాణాలు







వృత్తి విద్యపై నిర్లక్ష్యపు నీడ

ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు, స్కిల్ డెవలప్‌మెంట్‌పై చూపుతున్న నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో వృత్తి విద్యపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించాలన్న ఆశయంపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఐటీఐలో వసతుల లేమి... సౌకర్యాలు కొరతతో ఇటు సిబ్బంది అటు విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్న భవనం శిథిలావస్థలో దర్శనమిస్తుండగా కొత్తగా భవనం నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో అలసత్వం కారణంగా ఈ పరిస్థితి నెలకొంది.

– వెదురుకుప్పం

- నిధులు చాలక..ముందుకు సాగని పనులు
- అసంపూర్తిగా పక్కా భవన నిర్మాణపనులు
- పెచ్చులూడుతున్న ఐటీఐ భవనం పైకప్పు



పెచ్చులూడుతున్న పైకప్పు

ఐటీఐ పక్కా భవన నిర్మాణపు పనులు నిధులు లేక ఆగిపోయాయి. నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదని అధికారులు అంటున్నారు. వెదురుకుప్పంలో కొత్తగా ఐటీఐ కళాశాల ఏర్పాటు చేశారు. సీఆర్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొంత కాలంగా శిక్షణ ఇస్తున్నారు. వసతులు లేని కారణంగా పక్కా భవనం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తంగేళిమిట్ట సమీపంలోని సర్వే నెంబర్ 168–7లో 5 ఎకరాలు కేటాయించారు. 2013లో భవనాల నిర్మాణం కోసం రూ.3.77 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం నుంచి రూ.3 కోట్లతో నిర్మాణాలు చేపట్టాలంటూ అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. 2013 జూలై నుంచి పనులు ప్రారంభమయ్యాయి. వర్క్‌షాప్‌లు, కార్యాలయం భవనం, స్టోర్ రూంలకు సంబంధించి వేర్వేరుగా భవన నిర్మాణ పనులు చేపట్టాడు. పనులు జరుగుతున్న సమయంలో నిధుల విడుదలలో జాప్యం చోటు చేసుకుంది. మూడు భవనాల్లో ఒకటి శ్లాబ్ వరకు, ఇంకొకటి పిల్లర్ల వరకు, మరొకటి పునాదుల వరకు నిర్మాణం జరిగి ఆగిపోయాయి. రూ.3 కోట్లలో కేవలం రూ.1.40 కోట్లు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. దీంతో సదరు కాంట్రాక్టర్ నష్టం వస్తుందని భావించి పనులు పూర్తి చేయడం తన వల్ల కాదంటూ స్వచ్ఛందంగా విరమించుకున్నారు. అప్పటి నుంచి నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. భవన సముదాయంలో ముళ్లకంపలు, కమ్మీలు దుస్థితిలో ఉన్నాయి. ఆకతాయిలకు నిలయంగా మారాయి.


పెచ్చులూడుతున్నాయి

ప్రస్తుతం నడుస్తున్న భవనాలు దుస్థితిలో ఉన్నాయి. ఐటీఐలో 200 మందికి పైగా విద్యార్థులు ఆరు ట్రేడ్‌లకు సంబంధించి శిక్షణలో ఉన్నారు. అయితే భవనాలు పైకప్పు దుస్థితికి చేరి కమ్మీలు దర్శనమిస్తున్నాయి. వర్షం వస్తే తడిసి మోపెడవుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. పైకప్పు అధ్వానంగా ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియనిస్థితిలో ఉంటున్నారు. వర్షం వస్తే ఐటీఐ ఆవరణ బురదమయంగా తయారవుతోంది. వివిధ రకాల మెషీన్లు తడిసి పాడవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. తరగతులు నిర్వహించాలంటే శిథిల భవనాల్లో చేయాల్సిందేనని అంటున్నారు.

రూ.5.20 కోట్లకు ప్రతిపాదనలు

అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవనాలను పూర్తి చేసేందుకు మరో రూ.5.20 కోట్లు అవసరమవుతోందని అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ దశలను పరిశీలించిన తరువాత అంచనా వేసి ప్రభుత్వానికి ఈమొత్తంలో నిధులు అవసరమవుతాయని నివేదిక అందజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ నివేదికలు అడిగినా డబ్బులు మంజూరు కాలేదు. గతంలో రూ.కోటి 61లక్షలు మంజూరైంది. అయితే వాటి మంజూరుకు సంబంధించి విధి విధానాలు మారడంతో సకాలంలో స్పందించక అవి వెనక్కు పోయినట్లు సమాచారం.


ప్రభుత్వం పట్టించుకోవాలి



నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. కొన్నేళ్లుగా నిధులు లేక పనులు ఆగిపోయినా పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రులు మారుతున్నా సమస్యలను పట్టించుకునే దిక్కు లేదు. విద్యార్థుల ఇబ్బందులు వారికి పట్టనట్టు ఉంది. అధికారులు కూడా మీన మేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి.

– ఎం.రామయ్య, ఉపాధ్యక్షుడు, వైఎస్ఆర్ సీపీ, వెదురుకుప్పం

చర్యలు తీసుకుంటాం



అసంపూర్తిగా దర్శనిమస్తున్న పక్కా భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. కావాల్సిన ని ధుల కోసం అప్పట్లోనే అడిగాం. మళ్లీ 2023–24లో ప్రతిపాదనలు పంపాం. అయితే ప్రభుత్వం రాష్ట్రంలోని ఐటీఐలను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించినట్లు సమాచారం అందింది. అయితే మన కు అవసరమైన నిధులు కేటాయించ లేదు. నిధులు కేటాయించిన వెంటనే మర లా టెండర్‌లు పిలిచి పనులు పూర్తి చేయించాలి. పాత భవనాల్లో సమస్య తీవ్రంగా ఉంది. అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం.

– భైరవుడు, ప్రిన్సిపల్, ఐటీఐ, వెదురుకుప్పం.